క్లుప్తంగా

రాములమ్మకు మంత్రి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

నల్లగొండ టూటౌన్ : మంత్రి కేటీఆర్ పీఏ కానుగుల శ్రీనివాస్ మాతృమూర్తి కానుగుల రాములమ్మ చిత్రపటానికి సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళులర్పించారు. కానుగుల శ్రీనివాస్, దయాశంకర్, విజయ్, శివకుమార్ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి కోమటిరెడ్డి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బాలం రాజు కురుమ ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, రాజు, యాదగిరి, శశిధర్‌రెడ్డి, వారాల రమేష్, రేగట్టే నవీన్‌రెడ్డి, బండా వెంకన్న, రేగట్టే శేషుభూషన్‌రెడ్డి, శ్రీకాంత్, సాయికిరణ్, శేఖర్, శివ తదితరులున్నారు.

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన చనగాని ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన దశదినకర్మలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు పాల్గొని ముత్తయ్య కుమారులకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. చనగాని శంకర్, కృష్ణ, నగేష్, జినుకుంట్ల రాములు, జయశంకర్‌గౌడ్, నగేష్, నర్సింహ, మాద నర్సింహ, చిలకరాజు శంకరయ్య, చనగాని మునలయ్య, సింగం నాగరాజు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కిశోర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి'

నల్లగొండ టౌన్ : దళిత బంధు విషయంలో ఎమ్మార్పీఎస్ నాయకులను అవమానపరిచిన తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ తక్షణమే మాదిగ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు బకరం శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి పోతెపాక సాంబయ్య, ఆదిమల్ల శంకర్, బొజ్జ దేవయ్య, కురుపాటి కమలమ్మ పాల్గొన్నారు.

జలగం జనార్దన్‌కు నివాళి

నకిరేకల్ : జలగం జనార్దన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వక్కవంతుల కోటేశ్వర్‌రావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్దన్ అన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ కార్యదర్శి, జలగం జనార్దన్ రెండో వర్ధంతి సందర్భంగా నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జలగం జనార్దన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందూరి సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాయి కృష్ణ, అంబటి చిరంజీవి, బొంగరాల నర్సింహ ఉన్నారు.

'బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి'

మునుగోడు : దేశ సంపదను కార్పొరేట్ వ్యాపారులకు అప్పగించి దేశాన్ని అప్పులపాలు చేస్తున్న బీజేపీ రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య చారి, బొల్లగొరి నర్సింహ, గుర్జ రామచంద్రం, టి.వెంకటేశ్వర్లు, చాపల శ్రీను, భాస్కర్, భిక్షంరెడ్డి, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో కూర్చున్న కొంపల్లి గ్రామస్తులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న దీక్షలు 30 రోజుకు చేరాయి. దీక్షలో సోమవారం కొంపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు కూర్చున్నారు. వారికి ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులుతోపాటు సభ్యులు మద్దతు పలికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో నందిపాటి వెంకన్న, మునుకుంట్ల పరమేష్, సింగినేని శ్యామ్, నరేష్, సురేష్, శ్రీను, శివ, యాదయ్య, శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని 'రాంరెడ్డిపల్లి' !

- పలు వార్డుల్లో సీసీ రోడ్లు కరువు
- నత్తనడకన శ్మశానవాటిక పనులు
- నిరుపయోగంగా పాఠశాల భవనం



రాంరెడ్డి పల్లిలోని ఓ వీధిలో నిలిచిన మురుగు



పిల్లర్ గుంతలకే పరిమితమైన శ్మశానవాటిక

మర్రిగూడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు సకాలంలో ప్రారంభించి పూర్తిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నప్పటికీ అభివృద్ధి పనులు పూర్తిచేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మర్రిగూడ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో తానేదారుపల్లి, చర్లగూడెం ఆవాసా ప్రాంతాలతో కలుపుకుని 2011 జనాభా లెక్కల ప్రకారం 700కుపైగా కుటుంబాలు, 2485 జనాభా, రెండు వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. రాంరెడ్డిపల్లిలో శ్మశానవాటిక ఏళ్ల తరబడి పిల్లర్ గుంతలకే పరిమితమైంది. పలు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించలేదు. రాంరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల రోడ్డుకు సమీపంగా ఉండడంతోపాటు తరగతి గదుల కొరత వేధిస్తోంది. దీంతో రాజీవ్ విద్యా మిషన్ నుంచి మంజూరైన నిధులతో గ్రామంలోని బోడబండ వద్ద తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. మైనర్ పనులు మినహా భవన నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. ఆ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. భవనం ఉపయోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

శంకుస్థాపనకే పరిమితం..

2017–18 ఆర్థిక సంవత్సరంలో రాంరెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రస్తుత ఎమ్మెల్యే మొదటి దఫాలో గెలుపొందిన కాలంలోనే శంకుస్థాపన చేశారు. కాని నేటికీ ఆ పనులు పూర్తి కాలేదు. కమ్యూనిటీ హాల్‌కు నిధులు కేటాయించారు కానీ నిర్మాణ పనులు చేపట్టకపోడంతో నిధులు వెనుదిరిగాయి.

ప్రమాదకరంగా బావి

రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సమీపంలో పెద్ద బావి ప్రమాదకరంగా ఉంది. బావి సమీపంలో గ్రామపంచాయతీ నీటిట్యాంకు ఆంజనేయస్వామి ఆలయం ఉంది. దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంగన్‌వాడీ భవనంలో మౌలిక వసతులు సరిగా లేవని, నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు వేయడం లేదు



మా వీధిలో సీసీ రోడ్డు వేయడం లేదు. ప్రజాప్రతినిధులను అడిగితే త్వరలోనే సీసీ రోడ్డు వేస్తామని చెప్పన్నారు కానీ వేయడం లేదు. వర్షాలు పడుతుంటే వీధి అంతా కోతకు గురవుతోంది. అధికారులు స్పందించి సీసీ రోడ్డు పూర్తి చేయాలి.

– వడ్డె నరేష్, రాంరెడ్డిపల్లి

సకాలంలో పూర్తిచేయాలి



పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను సకాలంలో పూర్తి చేయాలి. గ్రామంలోని సీసీ రోడ్ల పక్కన మట్టి కూడా పోయలేదు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

-ఐతగోని ఉపేందర్, రాంరెడ్డిపల్లి

రెండు వారాల్లో పనులు పూర్తి చేస్తాం

రాంరెడ్డిపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నట్లు ఇటీవల మా దృష్టికి వచ్చింది. రెండు వారాల్లో నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేస్తాం. రూ.30 లక్షల నిధులు ఉన్నాయి. శ్మశానవాటిక, అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

-యశ్వంత్, పీఆర్ ఏఈ

నిర్వాసితులకు చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల

మర్రిగూడ : మండల పరిధిలోని శివన్నగూడ రిజర్వాయర్‌లో ఇళ్లు కోల్పోయిన చర్లగూడ గ్రామంలోని 234 మందికి మంజూరైన రూ.3,32,45,000 విలువ గల చెక్కులను సోమవారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మండల కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కులు అందనివారు అధైర్యపడవద్దని మరలా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి తగిన న్యాయం చేస్తామని అన్నారు. అనంతరం వీఆర్ఏలు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. చర్లగూడలో ముంపు గ్రామంలో ఉన్న ఆరు దళిత కుటుంబాలకు దళితబంధు పథకం వర్తింపజేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, తహసీల్దార్ దేవులపల్లి వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ తారకరామన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, సర్పంచ్ నల్లా యాదయ్య, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, బాలం నర్సింహ, దళితబంధు జిల్లా కమిటీ సభ్యులు లపంగి నర్సింహ, భీమానాయక్, నగేష్, యాదయ్య, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొండాపురం గ్రామంలో ధాన్యం కేంద్రాన్ని పరిశీలిస్తున్న బండ శ్రీశైలం

చండూరు(గట్టుప్పల) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ శ్రీశైలం అన్నారు. చండూరు మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత గోనె సంచులకు రంధ్రాలు ఉన్నాయని, అదనంగా తూకం వేస్తున్నారని అన్నారు. సీపీఎం చండూరు మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్, మునుగోడు మండల సీపీఎం సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి

మర్రిగూడ : రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం గరిష్ట మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ శ్రీశైలం అన్నారు. సోమవారం శివన్నగూడ, కుదభాక్షపల్లి, నామాపురం గ్రామాల్లోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, ధనుంజయగౌడ్, మైల సత్తయ్య, చాపల రవి, మైసయ్య, హనుమంతు, సోమయ్య, బద్రి, లక్ష్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలతో ప్రజల ఇక్కట్లు



పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

రామగిరి(నల్లగొండ) : విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో తిప్పర్తి మండలంలోని రైతులు, విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాల, లూజ్‌లైన్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో పలు గ్రామాల్లోని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన మండల అధికారి విధులకు సరిగ్గా హాజరు కాకపోవడంతో రైతులు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి, గృహావసరాలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. విద్యుత్ తీగలు పలుచోట్ల ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలకు, పశువులకు ప్రాణ సంకటంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిప్పర్తిలో బైపాస్ పనులు జరుగుతుండడంతో అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించిన విద్యుత్ సిబ్బంది కరెంట్ తీగలను టెలిఫోన్ స్తంభానికి బిగించారు. ఇనుప స్తంభం కావడంతో విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో గుర్రం వనజాతకు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. విద్యుత్ అధికారులు స్పందించి మండలంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, రైతులు ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మా వ్యవసాయం పొలం నుంచి ప్రధాన విద్యుత్ లైన్ వెళుతోంది. వైర్లు లూజుగా ఉండి కిందికి వేలాడుతున్నాయి. నిలబడితే చేతికి అందేలా ఉన్నాయి. పొలం దున్నే సమయంలో, వరికోత సమయంలో విద్యుత్ తీగలు హార్వెస్టర్‌కు అడ్డుగా ఉన్నాయి. రెండు సంవత్సరాలుగా విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

-సిరిసవాద సైదులు, జంగారెడ్డిగూడెం

ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు : ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గీత పారిశ్రామిక సంఘం రాష్ట్ర చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌లు అన్నారు. మునుగోడులో గౌడ కులస్తులు నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉత్సవాలతో గ్రామాల్లో ఐక్యత భావం పెంపొందుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుత్తా అమిత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లమల్ల కృష్ణారెడ్డి, తహసీల్దార్ ఎం. కృష్ణా రెడ్డి, ఎస్ఐ డి.సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సిబ్బంది

రామగిరి(నల్లగొండ) : భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సోమవారం జిల్లా గ్రంథాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కార్యదర్శి బి.బాలమ్మ, లైబ్రేరియన్ కట్టా నాగయ్య, జూనియర్ అసిస్టెంట్ ఎం.రాజేష్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ క్రైం : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం భాగ్యరెడ్డి వర్మ 135 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కేఆర్‌కే వరప్రసాద్, ఏఓ మంజుభార్గవి, వెల్ఫేర్ ఆర్ఐ స్పర్జన్ రాజ్, ఏఆర్ ఎస్ఐ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కనగల్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి ఎంపీపీ కరీంపాష పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భీమనపల్లి సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ గోవర్ధనబాయ్, టీఏలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్

మర్రిగూడ : మునుగోడు నియోజకవర్గంలోని ఆరు మండలాల, రెండు మున్సిపాలిటీల అధ్యక్షులను బీసీలకు కేటాయించి కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్ద పీట వేసిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని రాంరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మండల అధ్యక్ష పదవి వచ్చిందని జీర్ణించుకోలేక ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సిరిపంగి శ్రీనివాస్, మాదగోని కృష్ణయ్య, లపంగి యాదయ్య, దామెర జీవన్, గణేశ్ ఉన్నారు.

బీసీలను అణగదొక్కుతున్నారనడం అవివేకం

కాంగ్రెస్ పార్టీలో బీసీలను అణగదొక్కుతున్నారని మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్ చేసిన వ్యాఖ్యలు అవివేకమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ మాజీ మండల అధ్యక్షుడు రమావత్ శ్రీనునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సింహగౌడ్ నియామకం చెల్లదని, నూతన అధ్యక్షుడిని త్వరగా ఎన్నుకోవాలని కోరారు. బండి హనుమంతు, జంగయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటయ్య, ఇబ్రహీం, వెంకటేష్, శివ, జంగయ్య, సతీష్, వెంకటయ్యలు పాల్గొన్నారు.

కోచింగ్‌కు ఆర్థికసాయం

నకిరేకల్ : మంగళపల్లి గ్రామానికి చెందిన దోరెపల్లి శ్రీకాంత్ ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ మేరకు శ్రీకాంత్‌కు కోచింగ్ నిమిత్తం రూ.8500 ఆర్థిక సహాయం అందజేసినట్లు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బచ్చుపల్లి గంగాధర్‌రావు తెలిపారు.

స్వయం శక్తితో ఎదగాలి

కనగల్ : మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం శక్తితో ఎదగాలని అడిషనల్ డీఆర్‌డీఓ సరస్వతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని జియడవల్లి గ్రామంలో ఓ మహిళ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఫార్మ లైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) స్కీం ద్వారా పది లక్షల రుణం తీసుకుని ఏర్పాటు చేసిన బేకరీ, స్వీట్స్ షాపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ చిన్న తరహా ఉత్పత్తులను తయారు చేసే వారిని గుర్తించి లక్ష నుంచి పది లక్షల రూపాయల వరకు రుణ సహాయం కల్పించడం ఈ స్కీం ముఖ్య ఉద్దేశమన్నారు. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో 35శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. డీపీఎం బెనర్జీ, ఏపీఎం నరహరి, సీసీలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన రైతులు

శాలిగౌరారం : మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడంతో సోమవారం రైతులు గ్రామంలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై చెట్లకొమ్మలు అడ్డుగా వేసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. లారీలను రప్పించి కొనుగోళ్లు వేగంగా జరిగేలా చూడాలని అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైస్‌మిల్లుల యజమానులు ధాన్యం నాణ్యతగా లేదంటూ తాలు పేరిట కొర్రీలు పెడుతూ మిల్లులకు వెళ్లిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ సిబ్బందితో ధర్నా వద్దకు చేరుకొని రైతులను పక్కకు తరలించారు. రోడ్డుపై వేసిన చెట్లకొమ్మలను తొలగించారు. దీంతో రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు రైతులకు నచ్చజెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

ఆదుకుని అండగా నిలవాలని వేడుకోలు



మునుగోడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుమారుడితో శివలీల

మునుగోడు : తనకు రావాల్సిన ఆస్తి దక్కకుండా భర్త, అతడి కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇతరుల పేరు మీద పట్టా చేస్తున్న తన భర్త భూమిని తనకు వచ్చేలా చేయాలని కోరుతూ మునుగోడు మండలంలోని కల్వలపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి శివలీల సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో విన్నవించింది. వివరాలు.. కనగల్‌కు చెందిన శివలీలకు 2015లో కల్వలపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి సురేందర్‌రెడ్డితో వివాహం జరిగింది. వారికి ఏడేళ్ల బాబు ఉన్నాడు. ఆర్ఎంపీగా పనిచేస్తున్న శివలీల తన భర్తతో కలిసి కనగల్‌లో ఉండేది. 2018లో ఇద్దరి మధ్య తగవు జరగడంతో శివలీల నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సురేందర్ రెడ్డితో పాటు అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కోర్టు పరిధిలో కేసు కొనసాగుతోందని శివలీల తెలిపారు.

రెవెన్యూ అధికారులకు వినతి

సురేందర్ రెడ్డికి కల్వలపల్లి గ్రామంలో 3 ఎకరాల 12 గుంటల భూమి ఉంది. సురేందర్ రెడ్డి ఇటీవల 2 ఎకరాల 20 గుంటల భూమిని తన కుటుంబ సభ్యుల పేరు మీదకు మార్చినట్లు శివలీల తెలిపింది. మిగిలిన భూమినైనా తన భర్త మరొకరి పేరు మీద మార్చకుండా చూడాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించింది.

కంటిచూపు కోల్పోయిన శివలీల

కరోనా సమయంలో అనారోగ్యానికి గురైన శివలీల ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్దే ఉంటోంది. రెండు నెలల క్రితం కంటి చూపు పూర్తిగా కోల్పోయింది. తల్లిదండ్రులు చనిపోవడంతో ఆమెకు నా అనేవాళ్లు లేకుండా పోయారు. తనను వదిలేసి, ఆస్తి దక్కకుండా చేస్తున్న తన భర్తపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు, తన కుమారుడికి అధికారులు అండగా నిలవాలని శివలీల వేడుకుంటోంది.

రాణి రుద్రమదేవి సాధన క్యాంపు ప్రారంభం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాలికలు

చిట్యాల : పెద్దకాపర్తి గ్రామంలో యువ సంఘర్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాణి రుద్రమదేవి సాధన క్యాంపును సోమవారం ప్రారంభించారు. ఫౌండేషన్ చైర్మన్ అనుమోజు రామాచారి మాట్లాడుతూ క్యాంపులో బాలికలకు కరాటేతోపాటు కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యత, సామాజిక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్పంచ్ మర్రి జలందర్ రెడ్డి, సులోచన, రమణారెడ్డి, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ నీలకంఠం నరేష్, యోగా భారత్ చైర్మన్ శివ, వెంకటేశ్వర్లు, నర్సింహ, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు మూడు ఇళ్లు ధ్వంసం

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండలంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు అంతంపేట గ్రామంలో రెండు ఇళ్లు, రాగ్యా తండాలో ఓ ఇల్లు ధ్వంసమైనట్లు తహసీల్దారు లావణ్య తెలిపారు. ఇళ్లను ఆర్ఐ సురేష్ ద్వారా పంచనామా చేయించినట్లు వివరించారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

శాలిగౌరారం : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ ఎర్ర రణీల అన్నారు. మండలంలోని చిత్తలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మనబడి కార్యక్రమం కింద రూ. 32 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, సర్పంచ్ మామిడికాయల జయమ్మ, ఎంపీటీసీ దాసరి ప్రమీల, నాయకులు పాదూరి శంకర్‌రెడ్డి, దాసరి అబ్రహం, సుంకరి వీరయ్య పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్

మునుగోడు : ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు రైతుల వద్ద డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ హెచ్చరించారు. కల్వలపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు లారీ కిరాయి పేరుతో రైతుల వద్ద నగదు వసూలు చేయడంపై ఆదివారం 'లారీల పేరుతో నగదు వసూళ్లు' అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. తహసీల్దార్ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ విచారణ నిర్వహించారు. దాదాపు 15 మందికిపైగా రైతులు తమ వద్ద లారీ కిరాయి పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు అధికారికి విన్నవించినట్లు తెలిసింది. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ తెలిపారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేనా !



చండూరులో అక్రమంగా వెలిసిన డబ్బాలు

చండూరు : మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలు.. నిర్మాణాలపై కౌన్సిలర్లు వాట్సాప్ గ్రూపుల్లో చేస్తున్న పోస్టులు చండూరులో చర్చకు దారితీశాయి. అక్రమ నిర్మాణాలపై అధికారులు స్పందించడం లేదని మెజార్టీ కౌన్సిలర్లు ఏకమై గ్రూపుల్లో 15, 20 రోజులుగా పోస్టులు చేస్తున్నారు. ఇటీవల స్థానిక హైస్కూల్ ప్రహరీ వెంట అనుమతులు లేకుండా పార్టీల నాయకుల విగ్రహాల ఏర్పాటు చేశారు. అయితే విగ్రహాలను తొలగించాలని మున్సిపల్ అధికారులు బాధ్యులకు నోటీసులు కూడా అందించారు. నోటీసులు అందుకున్నా బాధ్యులు స్పందించలేదు. అధికారులు సైతం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే అదనుగా భావించిన లీడర్లు పోటాపోటీగా తమకు అనుకూల వ్యక్తులతో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు స్థలంలో ఆదివారం రాత్రి డబ్బాలు ఏర్పాటు చేయించారు. డబ్బాలను తొలగించకపోతే పట్టణంలో తాము సైతం డబ్బాలను ఏర్పాటు చేస్తామని కౌన్సిలర్లు వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్ చేశారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ మొయిజుద్దీన్ మాట్లాడుతూ పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు అందించామన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

మర్రిగూడ : మండల పరిధిలోని పలు విత్తనాల దుకాణాల్లో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీం ఏడీఏ ఇందుమతి ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శివన్నగూడ, మర్రిగూడలోని పలు దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందుమతి మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేశాక బిల్లులు తప్పనిసరిగా తీసుకొని భద్రపరుచుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వీరి వెంట మునుగోడు ఏడీఏ ఎల్లయ్య, టాస్క్‌ఫోర్స్ సీఐ నాగరాజు, సీడ్స్ సర్టిఫికేషన్ అధికారి సౌమ్య, మండల వ్యవసాయ అధికారి ఆవుల స్పందనలు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న స్నేహితులు

చిట్యాల : మండలంలోని చిన్నకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో చదివిన 1995–96 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన ఎర్రోజు శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. దీంతో అతడితోపాటు చదువుకున్న వారు తోటి స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. వారంతా కలిసి సేకరించిన రూ.80 వేల నగదును సోమవారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాజే నర్సింహ, చిలివేరు పరమేష్, భాగం శేఖర్, సప్పిడి వెంకట్‌రెడ్డి, రొండి నర్సింహ, కందుకూరి భిక్షం, అలివేలు, సుజాత, రమాదేవి పాల్గొన్నారు.